మెదక్ చర్చిలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శాంతికి ప్రతీక మెదక్ చర్చి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : శాంతికి ప్రతీక మెదక్ చర్చి అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్, ప్రెస్ బ్రీటర్ ఇన్‌చార్జి శాంతయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే జాజాల

బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో వీరు బీఆర్ఎస్‌లో చేరగా.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.

సింగరేణి సీఎండీ డిప్యూటేషన్ పొడిగింపు

హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఫైనాన్స్ డైరెక్టర్ బలరాం నాయక్ డిప్యూటేషన్‌ను మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆయననే పూర్తిస్థాయి సీఎండీగా నియమించే అవకాశం కూడా ఉన్నట్టు తెలుస్తున్నది.

ప్రయాణికుల ఫిర్యాదులపై దృష్టి

భద్రతా అంశాలపై రైల్వే అధికారుల సమీక్ష

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులు చేసే ఫిర్యాదుల పరిష్కారంపై రైల్వే అధికారులు దృష్టి సారించారు. రైళ్లలో ఏర్పాటు చేసిన కనీస సౌకర్యాలు, భద్రత వంటి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) సమన్వయంతో నేరాలను తగ్గించే వ్యూహాలు, మెరుగైన రైల్వే భద్రత కోసం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ జోనల్ మేనేజర్లతో చర్చించారు. రానున్న రోజుల్లో రైల్వే భద్రత అంశాలపై కీలకంగా వ్యవహరించాలని ఆర్పీఎఫ్ అధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జీఆర్పీ ఉన్నతాధికారుల 5వ అఖిల భారత సమావేశంలో ఈ అంశాలపైనా చర్చించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

సిరులవేణి.. సింగరేణి!

- 104 ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానం
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం
- సంస్థను వెంటాడుతున్న సమస్యల సవాళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బొగ్గు పేరెత్తగానే సింగరేణియే గుర్తుకొస్తుంది. నల్లబంగారానికి సింగరేణి పర్యాయపదమైంది. అంతలా ప్రసిద్ధి పొందిన సింగరేణి.. ఆవిర్భవించి నేటికి 104 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం పాల్గొననున్నారు. బొగ్గు వెలికితీత ప్రధాన బాధ్యతగా ఆవిర్భవించిన సింగరేణి వ్యాపార విస్తరణ, తదితర అనేక రంగాల్లోనూ పయనిస్తున్నది. కొత్త గనులనూ చేపట్టనున్నది. ఒడిశా నైనీ కోల్‌బ్లాక్, కొత్తగూడెంలో వీకే ఓసీ, ఇల్లందులో రొంపేడు ఓసీ, గోలేటి ఓసీల్లో ఉత్పత్తిని ప్రారంభించనున్నది. కొత్తగూడెంలో వెంకటేశ్ ఖని, ఇల్లందులో జవహర్‌ఖని గనులకు అనుమతులు పొందింది. రామగుండంలో 500 మోగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనున్నది. ఇటీవలే కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి సంకల్పించింది.

ఇతర ఖనిజ తవ్వకాలపైనా గురి

లిథియం సహా ఇతర ఖనిజాల తవ్వకాలపైనా సింగరేణి దృష్టిపెట్టింది. జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీకి చర్యలు చేపట్టింది. టీజీ జెన్‌కోతో కలిసి రామగుండంలో కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించనున్నది. రాజస్థాన్‌లో సోలార్ ప్లాంట్‌ను నిర్మించనుంది. ఇంతటి ఘనకీర్తిని కలిగిన సింగరేణిని పలు సమస్యలు వెన్నాడుతున్నాయి.

సమస్యలు.. సవాళ్లు!

- సింగరేణిలో మొత్తం 40 గనులుంటే 22 భూగర్భ గణులే. వీటిలో ఉత్పాదక వ్యయం అధికం కావడంతో ఏటా రూ.3 వేలకోట్లు నష్టాలొస్తున్నాయి.
- కొత్తగా ఉత్పత్తి ప్రారంభించాల్సిన గనులకు కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ నుంచి సకాలంలో అనుమతులు రావడం లేదు. ఈ కారణంతోనే నైనీ కోల్‌బ్లాక్ నాలుగేండ్లుగా ముందుకుసాగడం లేదు.
- ఉత్పత్తి నిరుడు 72 మిలియన్ టన్నులు ఉండగా, ఈ ఏడాది 74 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నది. ఆర్థిక సంవత్సరానికి ఇంకా 100 రోజులే గడువు ఉండగా, రోజుకు 2.7 లక్షల టన్నుల బొగ్గును వెలికితీస్తేనే లక్ష్యం పూర్తవుతుంది.
- కార్మికుల గైర్హాజరు, పనిగంటలు సైతం బొగ్గు ఉత్పత్తి, సంస్థ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయి. 2024 జనవరి నుంచి అక్టోబర్ వరకు 300 రోజుల్లో 75 రోజులు కూడా పనిచేయని కార్మికుల సంఖ్య 1,892గా తేలింది. పలువురు కార్మిక సంఘాల నేతలు డుమ్మాలు కొడుతున్నారు.
- యంత్రాల వినియోగంలోనూ చెప్పుకోదగిన పురోగతి లేదు. యంత్రాలను 18 గంటలు నడపాలని సంస్థ వర్గాలు పదే పదే ఆదేశాలిస్తున్నాయి.
- బొగ్గు గనుల్లో ప్రమాదాలు, కార్మికుల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.
- కారుణ్య నియామకాల్లో అక్రమాలు సంస్థకు మాయనిమచ్చను తెచ్చిపెట్టాయి. ఈ అక్రమాలపై సీఐడీ విచారణ జరిపింది.
- వర్షాలు, వరదలు సైతం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. భారీ వర్షాలతో ఓపెన్‌కాస్టుల్లో నీరు చేరుతున్నది. ఈ నీటి తొలగింపు పెద్ద సమస్యగా మారుతున్నది.

ఏఆర్ఐఐఏలో దేశంలో మొదటి ర్యాంక్

'విజనరీ లీడర్షిప్' సదస్సులో ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్ వరదరెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 22: అటల్ ర్యాంకింగ్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ ఆన్ ఇన్నోవేషన్ ఎచీవ్‌మెంట్స్ (ఏఆర్ఐఐఏ)లో దేశంలోనే మొదటి ర్యాంకు తమ ఎస్ఆర్ యూనివర్సిటీదేనని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. 'విజనరీ లీడర్‌షిప్ – ప్రపంచ స్థాయి అవకాశాలు' అనే అంశంపై ఖమ్మంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. తమ విశ్వవిద్యాలయంలో మొదటి 500 అడ్మిషన్లకు ప్రత్యేక స్కాలర్‌షిప్ అవకాశాన్ని కల్పించినట్లు చెప్పారు. ఎస్ఆర్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ హబ్ ద్వారా చదుతున్నప్పుడే స్టార్టప్ కంపెనీలను నిర్వహించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ టీ.శేషగిరిరావు మాట్లాడుతూ.. ఎస్ఆర్ యూనివర్సిటీలో డ్యూయల్ డిగ్రీ కోర్సులు, ఇంటర్నేషనల్ ఇంజినీరింగ్ ప్రోగ్రాములను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియా, అమెరికా సహా పలు దేశాల్లో ఉన్న టాప్ యూనివర్సిటీలతో ఒప్పందంతో ఉన్న కోర్సులు కూడా ఉన్నాయని వివరించారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఎస్ఆర్ యూనివర్సిటీకి 150 సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఎంవోయూ ఉందని అన్నారు. తద్వారా విద్యార్థులకు అత్యధికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. జీపీ డైరెక్టర్ అనిత, ఎస్ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనా రెడ్డి, అడ్మిషన్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ రామ్ రఘోత్తమరావు దేశ్‌ముఖ్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలోని సమస్యలను పరిష్కరిస్తా..

ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 22 : ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యావ్యవస్థలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పీఆర్‌టీయూ తెలంగాణ ఉమ్మడి ఖమ్మం–నల్గొండ–వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు కొమ్మినేని అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సీపీఎస్‌ను రద్దు చేయించి ఓపీఎస్ ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు. మిగిలిపోయిన ఉద్యోగోన్నతులు ఇప్పించేలా, ఈహెచ్ఎస్‌ను ప్రతి కార్పొరేట్‌లో ఉచిత వైద్యం అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉమాకర్‌రెడ్డి, శ్రీనివాసచారి, రమేష్, ఓం ప్రకాష్, హరిప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సుదర్శనాచారి, ముత్తినేని సురేష్, శిరీష, వీరేంద్ర పాల్గొన్నారు.

ప్రణాళికలతో విజయాలు సాధించాలి

– ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ రూరల్, డిసెంబర్ 22: విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) ప్రభుత్వ జూనియర్ కళాశాలకు యాభై సంవత్సరాలు నిండిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఆదివారం కళాశాలలో జరిగాయి. దీనిని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.. జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి గతంలో రెండు కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. కళాశాలకు ప్రహరీ, అదనపు గదుల నిర్మాణం తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రిన్సిపాల్ శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాటి ప్రిన్సిపాల్స్‌ను, సీనియర్ లెక్చరర్లను నిర్వాహకులు సన్మానించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని చెప్పారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వివేక్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, పూర్వ ప్రిన్సిపాల్స్ విజయపూర్ణిమ, రామచందర్‌రావు, శ్రీనివాసరావు, లెక్చరర్లు గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, సుధాకర్, పి.రావు, అంజన, సుమతి, నిసార్ అహ్మద్, తిరుమలరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించకుండానే తుప్పు పడుతోంది..

- మార్కెట్ గోదాములో నిరుపయోగంగా వే బ్రిడ్జి
- చంద్రుగొండలో అధికారుల నిర్లక్ష్యం

మార్కెట్ గోదాము ప్రాంగణంలో నిరుపయోగంగా ఉండి తుప్పు పట్టిన వే బ్రిడ్జి

చంద్రుగొండ, డిసెంబర్ 22 : చంద్రుగొండ వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో వే బ్రిడ్జి తుప్పు పట్టి పాడైపోతున్నది. ఏడాది క్రితం సుమారు రూ.15 లక్షల వ్యయంతో రైతుల కోసం ఎలక్ట్రిక్ వే బ్రిడ్జిని నిర్మించారు. అరవై మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల ఈ వేబ్రిడ్జి ఈ ప్రాంత రైతుల పోరాటం, అవసరాల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసింది. అన్ని బాగానే ఉన్నా అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రారంభం కాకుండానే వేబ్రిడ్జి తుప్పు పట్టిపోయింది. మండల రైతులు పలుమార్లు వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. లక్షల రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మారుతున్నా అధికారులు, పాలకుల్లో కనీసం చలనం లేకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన ఎలక్ట్రిక్ వేబ్రిడ్జిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

రూ.లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వం వే బ్రిడ్జిని మంజూరు చేస్తే అధికారులు కనీసం ప్రారంభించలేదు. రైతులు పలుమార్లు చెప్పినా కనీస స్పందన లేదు. ఇప్పటికైనా వేబ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలి. అధికారులు నిర్లక్ష్యం వీడాలి. కారకులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– పెద్దిని వేణు, రైతు సంఘం నాయకుడు

ఉద్యోగోన్నతి పొందిన స్పెషల్ టీచర్లపై నీలినీడలు?

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు సీఆర్ఆర్ తప్పనిసరి

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 22: రాష్ట్ర ప్రభుత్వం జులైలో నిర్వహించిన ఉపాధ్యాయ ఉద్యోగోన్నతుల్లో భాగంగా అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్)గా ఉద్యోగోన్నతులు కల్పించారు. ప్రభుత్వ, లోకల్‌బాడీలో 20కిపైగా ఖాళీలు ఉండగా ఏడుగురు అభ్యర్థులకు మాత్రమే ఉద్యోగోన్నతి లభించింది. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఉద్యోగోన్నతులు కల్పించడం ఇదే మొదటిసారి. ఉద్యోగోన్నతులు పొందే నాటికి సీఆర్ఆర్ వ్యాలిడిటీ ఉండాలి. సీఆర్ఆర్ లేకుండానే ఉద్యోగోన్నతులు పొందారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వారి సర్టిఫికెట్లపై కొందరు ఉపాధ్యాయులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సర్వీస్‌కు సీఆర్ఆర్ తప్పనిసరి...

స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఉపాధ్యాయుడిగా పని చేయాలంటే వారికి రిహ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) జారీ చేసిన సీఆర్ఆర్(సెంట్రల్ రిహాబిలిటేషన్ రిజిష్టర్) తప్పనిసరిగా కలిగి ఉండాలి. సమ్మిళిత విద్య విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే ఐఈఆర్పీ(ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్) పోస్టుకు కూడా సదరు సీఆర్ఆర్ కలిగి ఉండటం తప్పనిసరి. ఈ సీఆర్ఆర్ ఐదు సంవత్సరాల కాలవ్యవధికి జారీ చేయబడుతుంది. ఈలోగా కనీసం వంద సీఆర్ఆర్ పాయింట్లు సాధిస్తే తిరిగి సీఆర్ఆర్ మరో 5 సంవత్సరాల కాల పరిమితికి పొడిగించబడుతుంది. ఈ పద్ధతిలో రెగ్యులర్ ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు సర్వీస్ ఉన్నంతకాలం సీఆర్ఆర్ కలిగిఉండాలి. ఈ నేపథ్యంలో స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో ఉద్యోగోన్నతి పొందిన ఎస్జీటీల విద్యార్హత, సీఆర్ఆర్‌ల వ్యాలిడిటీపై పలువురు ఉపాధ్యాయులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ప్రకారమే నిర్వహించాం..

ఉద్యోగోన్నతుల ప్రక్రియను నిబంధనల ప్రకారమే నిర్వహించాం. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉద్యోగోన్నతుల పొందిన వారి సర్టిఫికెట్లు మరోసారి పరిశీలిస్తాం. తేడాలుంటే చర్యలు తీసుకుంటాం.

– సోమశేఖరశర్మ, డీఈవో

వృద్ధురాలిపై దాడి.. అదనపు డీసీపీ విచారణ

విచారణ జరుపుతున్న అదనపు డీసీపీ ప్రసాద్‌రావు

తిరుమలాయపాలెం, డిసెంబర్ 22: వృద్ధురాలిపై దాడి చేసి బంగారపు ఆభరణాలు దొంగిలించి కేసు విషయమై మండలంలోని పిండిప్రోలులో ఆదివారం అడిషనల్ డీసీపీ ప్రసాదరావు విచారణ చేపట్టారు. పిండిప్రోలులోని తన ఇంట్లో నిద్రిస్తున్న ఆరెంపల వెంకటమ్మపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. ఆమె మెడలోని తులన్నర బంగారపు ఆభరణాలను దొంగిలించారు. వెంకటమ్మ ఇంటిని అడిషనల్ డీసీపీ పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. వృద్ధురాలిపై దాడి కేసు నిందితులను వెంటనే గుర్తించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో మంచుదుప్పటి

ఏజెన్సీ మండలమైన దుమ్ముగూడెం మంచుదుప్పటి కప్పకుంది. నర్సాపురం, దుమ్ముగూడెం క్రాస్‌రోడ్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు మంచుతో కప్పినట్లుగా కన్పిస్తున్నాయి. వాహనాల వెలుతురులో మంచును చీల్చుకుంటూ వాహనదారులు ప్రయాణిస్తున్న దృశ్యాలు కన్పిస్తున్నాయి. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో మొదలైన మంచు బిందువులు కొందరికి ఆహ్లాదాన్ని కలిగించగా.. ప్రయాణాలు చేసే మరికొందరిని మరికొంత ఇబ్బందులు పెట్టాయి.

–దుమ్ముగూడెం/ పర్ణశాల, డిసెంబర్ 22

దుమ్ముగూడెంలో కురుస్తున్న మంచు బిందువులు

పర్ణశాల వద్ద రహదారిపై కురుస్తున్న పొగమంచు

విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించాలి

డీడీ సత్యనారాయణ

వసతిగృహ విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న డీడీ సత్యనారాయణ

మామిళ్లగూడెం, డిసెంబర్ 22: ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో ఉండి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించి, సదుపాయాలు కల్పించాలని ఎస్సీ అభివృద్ధిశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ సూచించారు. ఆదివారం నగరంలోని ఎన్ఎస్పీ క్యాంపులో ఉన్న ఎస్సీ అభివృద్ధిశాఖ బాలికల వసతి గృహం–ఏను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి వసతిగృహంలో వారికి అందిస్తున్న సౌకర్యాలు, భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి ఎన్.విజయ, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

మామిళ్లగూడెం, డిసెంబర్ 22 : నగరంలోని పలు ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్సు ఏసీపీ రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి తాగేందుకు అడ్డాలుగా చేసుకున్న పలు ప్రాంతాల్లో నిఘా పెట్టి శని, ఆదివారాలు రెండురోజులపాటు ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతోపాటు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం తనిఖీలు చేశామని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయించడం, సరఫరా చేయడం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని రోటరీనగర్ ట్యాంక్, ఎస్బీఐటీ కళాశాల పరిసరాలు, చర్చి కంపౌండ్, జహీర్‌పుర పార్కు పరిసరాలు, ప్రకాష్‌నగర్, ఎన్‌టీఆర్ సర్కిల్, కొత్త బస్టాండ్, గట్టయ్య సెంటర్, సరితక్లినిక్, సారధినగర్ దిగువ రైల్వే వంతెన, గొల్లగూడెం పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామని వివరించారు.

ఇద్దరు సైబర్ నేరస్తుల అరెస్టు

మామిళ్లగూడెం, డిసెంబర్ 22 : సైబర్ నేరాలకు పాల్పడుతూ యువతను మోసం చేస్తున్న ఇద్దరు సైబర్ నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ సీహెచ్ఆర్‌వీ ఫణిధర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లికి చెందిన ఓ యువకుడికి ఫెండ్ రిక్వెస్టు పెట్టి పరిచయం ఏర్పాటు చేసుకుని మోసాలకు పాల్పడుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, జై కేసారం గ్రామానికి చెందిన సరిపల్లి శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్టణం జిల్లా, పెందుర్తి మండలం, నాయుడుతోట గ్రామానికి చెందిన వంకర లావణ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులు చేధించడంలో ముఖ్యపాత్ర వహించిన ఏసీపీ ఫణిదర్, ఎస్ఐ రంజిత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నాగేశ్వరరావును పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

గురుదక్షిణ ఫౌండేషన్‌లో క్విజ్ పోటీలు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో, నిర్వాహకులు

ఖమ్మం రూరల్, డిసెంబర్ 22: మండలంలోని కరుణగిరి ఏరియాలోగల గురుదక్షిణ ఫౌండేషన్‌లో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సైన్స్, మ్యాథ్స్ క్విజ్ పోటీలు జరిగాయి. 59 పాఠశాలల నుంచి 398 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు బహుమతులను డీఈవో సోమశేఖర శర్మ, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్ ప్రదానం చేశారు. గాంధేయవాదులు చేకూరి కాశయ్య, ఎస్వీ నారాయణరావు జ్ఞాపకార్థంగా ఈ పోటీలను నిర్వహించినట్లు ఫౌండేషన్ చైర్మన్ జి.శంకరయ్య, వైస్ చైర్మన్ పారుపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. సభ్యులు దాసు భిక్షమయ్య, చావా సత్యనారాయణ ప్రసాద్, క్విజ్ మాస్టర్ ధనుష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులకు బెనిఫిట్స్ అందించేందుకు కృషి

ఎస్‌బీఐ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

నల్లగొండ, డిసెంబర్ 22 : ఎస్‌బీఐ ఉద్యోగులకు అందాల్సిన ప్రతి బెనిఫిట్స్ తప్పనిసరిగా అందజేసే విధంగా కృషి చేస్తానని ఆ బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రీధర్ అన్నాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు సంబంధించిన ఎస్‌బీఐ ఉద్యోగుల కాన్ఫరేషన్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీధర్ మాట్లాడుతూ ఉద్యోగులు కస్టమర్ల సేవల విషయంలో రాజీపడవద్దని, కస్టమర్లకు సేవలు చక్కగా అందించినట్లయితే బ్యాంకు ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. యూనియన్ అనేది ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తుందని, ఈ యూనియన్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపైనా ఉందన్నారు. వచ్చే నెలలో పదవీ విరమణ చెందుతున్న ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు క్లాక్‌టవర్ బ్యాంకు నుంచి ఇంద్రారెడ్డి ఫంక్షన్‌హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ఆ సంఘం రీజనల్ కార్యదర్శి సురిగి నర్సింహాగౌడ్, అసిస్టెంట్ రీజనల్ కార్యదర్శి సుమన్‌కుమార్, ట్రెజరర్ శాండిల్య, ప్రవీణ్, జగన్‌సింగ్ పాల్గొన్నారు.